


## లంబాడి నాయకులను ముందస్తు అరెస్టు

**తూప్రాన్.సెప్టెంబర్ 11ప్రజా స్వరం**

మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లంబాడి ఐక్యవేదిక మెదక్ జిల్లా అధ్యక్షులు నాలుగో వార్డ్ కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ శుక్రవారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా లంబాడీల హక్కుల కోసం సంతు శ్రీ సేవాలాల్ మహారాజ్ మందిరము అడవిలో కాకుండా హైదరాబాదులో ఉండాలని ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని విద్యార్థుల స్కాలర్షిప్ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరుతూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి గిరిజన విద్యార్థి సంఘం పిలుపుమేరకు కార్యక్రమానికి ముందస్తుగా అరెస్టు చేశారు అరెస్టు చేసిన వారిలో తూప్రాన్ మున్సిపల్ నాలుగో వార్డ్ కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ దిగావత్ శివ నాయక్ తదితరులు ఉన్నారు

## కుల గణన చేపట్టాలని బీసీల ధర్మ పోరాట దీక్ష....

**మెదక్, సెప్టెంబర్ 11 (ప్రజా స్వరం)**

దేశ వ్యాప్తంగా జనగణన తో పాటు కుల గణన చేపట్టి, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి జనగణనలో కులగణనను చేర్చాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు ప్రస్తుతం తక్కువ రిజర్వేషన్లు కల్పించడం అన్యాయమన్నారు. "మేమెంతో-మాకంత" నినాదంతో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్మ పోరాట దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గంగారాం, ఉపాధ్యక్షుడు మల్లేశం, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతల నరసింహులు, మెదక్ అసెంబ్లీ బీసీ సంఘం అధ్యక్షుడు సాప రవి, శ్రీదేవి, శభానా, సుంకోజ్ దామోదర్ చారి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.







## వినాయక నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

**తూప్రాన్ సెప్టెంబర్ 11 ప్రజా స్వరం ప్రతినిధి**

వినాయక చవితి సందర్భంగా తూప్రాన్ పట్టణంలో నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు రెవిన్యూ పోలీస్ అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు.

వినాయక నిమజ్జనానికి సంబంధించిన ప్లాన్ ఆఫ్ యాక్షన్‌లో భాగంగా తూప్రాన్ పెద్దచెరువు నిమజ్జన ప్రాంతాన్ని ఆర్డీఓ తూప్రాన్, డీఎస్పీ నరేందర్ గౌడ్ తూప్రాన్ అర్డీఓ బావయ్య తూప్రాన్, సీఐ వెంకట రాజా గౌడ్ తూప్రాన్,ఎసై గంగరాజు ఎంఆర్ఓ,చంద్రశేఖర్ రెడ్డి మున్సిపల్ అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.

ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, వాహనాల రాకపోకలు, విగ్రహాల నిమజ్జనం సజావుగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించారు.

నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.



# తునికి ఖల్సాలో స్టిక్కీ ట్రాప్స్ ఏర్పాటు

**వర్గల్ సెప్టెంబర్ 11 (ప్రజాస్వరం) :-**




పంటల్లో హానికర పురుగుల నియంత్రణకు స్టిక్కీ ట్రాప్స్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. తునికి ఖల్సా రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రాజేంద్రనగర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్‌కు చెందిన RAWEP విద్యార్థులు రైతులకు ట్రాప్స్ ఏర్పాటు, వినియోగ విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు.పసుపు రంగు ట్రాప్స్‌ను తెల్లదోమలు, ఆఫిడ్స్, జాసిడ్స్ వంటి పురుగుల పర్యవేక్షణకు, నీలం రంగు ట్రాప్స్‌ను త్రిప్స్ నియంత్రణకు ఉపయోగించవచ్చని తెలిపారు. పంటలో పురుగుల ఉనికిని ముందుగానే గుర్తించి, వాటి ఉధృతిని బట్టి సమగ్ర పురుగు యాజమాన్య పద్ధతుల్లో నియంత్రణ చర్యలు చేపట్టవచ్చన్నారు.ఈ సందర్భంగా ఏఈఓ అనిత మాట్లాడుతూ.. స్టిక్కీ ట్రాప్స్ వంటి పర్యావరణహిత పద్ధతులను రైతులు వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచి గణేష్, ఉప సర్పంచి, వార్డు సభ్యులు, RAWEP విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం పుణ్యం: మాజీ మేయర్ మేకల కావ్య

- **ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం పుణ్యం: మాజీ మేయర్ మేకల కావ్య**

**జవహర్ నగర్, సెప్టెంబర్ 11 (ప్రజాస్వరం:)**

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం దేవునికి చేసిన సేవతో సమానమని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు.శుక్రవారం అమావాస్య పురస్కరించుకొని జవహర్ నగర్ లో మేకల అయ్యప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకల కావ్య మాట్లాడుతూ.. మా కుటుంబం బికేఆర్ కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో అధినేత మేకల అయ్యప్ప ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం మాకు గొప్ప వరమన్నారు. ప్రతి అమావాస్య బాలాజీ నగర్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బండ కింది ప్రసాద్ గౌడ్, సుధాకర్ చారి ,యువజన విభాగం అధ్యక్షులు మేకల భార్గవరామ్, స్థానిక నాయకులు,పంతంగి సిద్ధులు యాదవ్,పొలాస సాయికుమార్,కూటికంటి వెంకటేష్ గౌడ్.పొలాస సాయి కుమార్, మైనార్టీ నాయకుడు అహ్మద్ భాషా కార్యకర్తలు,కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.

- **ఆరోగ్య సేవలపై సమీక్ష**
- **ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శివ దయాల్**

**తూప్రాన్ సెప్టెంబర్ 11 ప్రజా స్వరం ప్రతినిధి**

మెదక్ జిల్లా తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రిలో సమన్వయకర్త డాక్టర్ శివ దయాల్ వైద్యాధికారులను ఆదేశించారు.

శుక్రవారం తూప్రాన్ లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను డి సి హెచ్ ఎస్ డాక్టర్ శివ దయాల్ ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వ్యాక్సిన్ గది, ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్ వార్డ్ ల్యాబొరేటరీ, ఫార్మసీ, కిచెన్, తదితర విభాగాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా డిసిహెచ్ఎస్ డాక్టర్ శివ దయాల్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న దాదాపు 50 మందికి చికిత్సలు అందించడం జరిగింది అన్నారు. 150 మంది రక్తనమూణాలు సేకరించి టీ హబ్ కు పంపించడం జరిగిందన్నారు .ఆసుపత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని రోగులకు ఆహారం, ఆసుపత్రి పరిశుభ్రత సంతృప్తికరంగా ఉన్నాయన్నారు

ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ శారీరక మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తద్వారా వ్యాధులను సమూలంగా నిర్మూలించవచ్చు అన్నారు.



ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ డాక్టర్ అమర్ సింగ్ వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో ఫుడ్ కమిషన్ ఆకస్మిక తనిఖీలు

**ప్రజాస్వరం,మేడ్చల్**

మేడ్చల్‌లో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ బృందం శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రేషన్ దుకాణాల్లో నిల్వలు, ఈపాస్ యంత్రాలు, పంపిణీ రికార్డులను పరిశీలించారు. అనంతరం కిష్టాపూర్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల వంటగదిని తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించాలని సిబ్బందికి సూచించారు.



# స్లెడ్జింగ్‌కు ప్రతీకారం.. తిలక్ వర్మకు చుక్కలు చూపించిన వైభవ్ సూర్యవంశీ..

- **దులీప్ ట్రోఫీ ఫైనల్లో తిలక్ వర్మ, సూర్యవంశీ మధ్య వాగ్వాదం**
- **తిలక్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో వైభవ్ స్లెడ్జింగ్**
- **తిలక్ ఫిర్యాదుతో నాకు ఇలాగే జరిగిందంటూ యువ సంచలనం కౌంటర్**
- **13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ దులీప్ ట్రోఫీని గెలుచుకున్న ఈస్ట్ జోన్**
- **ఈస్ట్ జోన్ తమను పూర్తిగా డామినేట్ చేసిందన్న తిలక్ వర్మ**





**ప్రజాస్వరం:**

దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ నాలుగో రోజు ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సౌత్ జోన్ కెప్టెన్, తెలుగు ఆటగాడు తిలక్ వర్మతో ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మైదానంలో వాగ్వాదానికి దిగాడు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచి, 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత టైటిల్‌ను కైవసం చేసుకుంది.

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్లో సౌత్ జోన్ ఇన్నింగ్స్ సందర్భంగా తిలక్ వర్మ బ్యాటింగ్‌కు వచ్చాడు. ఈ సమయంలో వైభవ్ అతడిని మాటలతో రెచ్చగొట్టే ప్రయత్నం (స్లెడ్జింగ్) చేశాడు. తొలిరోజు తాను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు తిలక్ తనను స్లెడ్జింగ్ చేసినందుకు బదులు తీర్చుకున్నాడు.

ఈ క్రమంలో వైభవ్ భుజం తిలక్‌కు తగలడంతో సౌత్ జోన్ కెప్టెన్ అంపైర్‌కు ఫిర్యాదు చేశాడు. అంపైర్ వచ్చి వైభవ్‌తో మాట్లాడుతుండగా.. "సార్, ఫస్ట్ ఇన్నింగ్స్‌లో నాతో కూడా ఇలాగే జరిగింది" అని అతను సరదాగా గుర్తుచేశాడు. ఈ ఘటన మైదానంలో కాసేపు ఉత్కంఠ రేపింది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఈస్ట్ జోన్.. కెప్టెన్ ఇషాన్ కిషన్ అద్భుత డబుల్ సెంచరీతో చెలరేగడంతో ఏకంగా 708 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్ జోన్‌ను 325 పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించడంతో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది. 201213 సీజన్ తర్వాత ఈస్ట్ జోన్‌కు ఇదే తొలి దులీప్ ట్రోఫీ కావడం విశేషం. ఈ విజయంతో సౌత్ జోన్ వరుసగా రెండోసారి టైటిల్ గెలవాలన్న ఆశలకు గండిపడింది.

ఓటమి తర్వాత సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ స్పందించాడు. ఈ ఫలితం నిరాశపరిచిందని, కానీ ఈ గేమ్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నామని చెప్పాడు. "నిజం చెప్పాలంటే, ఈస్ట్ జోన్ మమ్మల్ని పూర్తిగా డామినేట్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 700 పరుగులు ఇచ్చినప్పుడే మ్యాచ్ మా చేజారింది. వారి బ్యాటర్లకు క్రెడిట్ ఇవ్వాలి. మేం బౌలింగ్‌లో మరికొంత మెరుగ్గా రాణించాల్సింది" అని తిలక్ వర్మ అంగీకరించాడు. ఈ మ్యాచ్‌లో తిలక్ 99 పరుగులు చేసి త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు.

